# రామచంద్రుని అరణ్యావాసం

రామచంద్రరావుకు అరణ్యవాస యోగం ఉందని ఎవరూ కలగనలేదు. హఠాత్తుగా ప్రమోషను వచ్చింది. చేసిన సేవకు తప్పనిరిసగా ప్రమోషను యిచ్చినా, యింతకాలం కడుపులోచల్ల కదలకుండా కాలక్షేపం చేసిన రామచంద్రరావు కొన్నాళ్ళు అరణ్యప్రాంతాల్లో ఉద్యోగం చెయ్యమని అధికారులు ఆర్డరు వేశారు. భార్య సీతను వెంటబెట్టుకుని వెళ్ళే స్థితి కలగలేదు, తమ్ముడు లక్ష్మణుడు తన దగ్గరే పట్టణంలోచదువుకుంటున్నాడు. తండ్రి దశరధుడు, తల్లి కౌసల్యను చూడవలసిన బాధ్యత భార్యకు అప్పగించి, ఆరణ్యవాసానికి అధికారుల వాక్యం జవదాటకుండా ప్రయాణమై వచ్చాడు రామచంద్రరావు ఒంటరిగా,

వచ్చీ రావడంతోటే, ఆఫీసులో ఉద్యోగుల పరిచయమైనా కాకముందే, టెలిగ్రాం వచ్చింది.ఆరణ్యం మధ్యలో ఉన్న ప్రాజెక్టు ప్రాంతంలోని కార్మికులు నిరాహార సమ్మె చేస్తున్నారని, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, గొంతెమ్మ కోర్కెలతో తమ్ము విసుగిస్తున్నారనీ, వీళ్ళ విషయం సరిగా తేల్చకపోతే తమకు ప్రాణాపాయం ఉందనీ ప్రాజెక్టు అధికారులు తంతి పంపారు. ప్రాజెక్టు ప్రారంభించిన నాలుగు సంవత్సరాలలో ఎన్నడూ కార్మికుల దౌర్జన్యం యింత తీవ్ర పరిస్థితికి రాలేదని వారు విజ్ఞాపన పంపారు. రామచంద్రరావు ఊపిరి పీల్చుకోకుండానే ఎదురుపడ్డ సమస్యచూచి కంగారుపడినా, బయటకు మాత్రం స్థిమితం చిక్కబట్టుకున్నట్టే కనపడ్డాడు. ఆఫీసులో ఉద్యోగుల నడిగాడు ప్రాజెక్టుకు దారి ఎలాగ అని? ఎవరికీ తెలియదన్నారు. బంట్రోతు అంజయ్య కూడా తన అజ్ఞానం రామచంద్రుని ముందు ఒప్పుకున్నాడు. దుష్టశిక్షణ,

శిష్టరక్షణ తన ఉద్యోగ ధర్మంగా పెట్టుకున్న రామచంద్రరావు ప్రాజెక్టుకు ఏ విధంగానైనా ప్రయాణం చేయాలనే నిశ్చయించుకున్నాడు. ఎదురు తంతి పంపాడు వస్తున్నానని. ప్రాజెక్టు అధికారులు వార్త పంపారు, తాము కారుదిగిన గమ్యస్థానం నుంచి అరణ్యంలోని ప్రాజెక్టు దగ్గరికి రావడానికి మరో కారు పంపుతున్నామని. రామచంద్రరావు ధైర్యం చిక్క బట్టుకుని ఒక్క బంట్రోతును వెంటబెట్టుకుని ప్రయాణం సాగించాడు.

కారు చర్రున నడుస్తోంది. రోడ్డు కిరువైపులా దట్టమైన చెట్లు అల్లుకుని లోలోపల ఏముందో తెలియకుండా వుంది. రోడ్డుమీద కారు తప్ప జనం అలికిడి లేదు. అప్పుడప్పుడు వీధికుక్కల పహరా, టెలి ఫోన్ తీగెలమీద పాలపిట్టల స్వాగతం. చెట్లమీద నివాసాలు ఏర్పరచు కున్న పిట్టల కూడితాలు తప్ప మరేం వినిపించటం లేదు. కారులో కూడా డ్రైవరు, కండక్టరుతోపాటు మరో యిద్దరు కోయదొరలు మాత్రం ఉన్నారు.

ప్రొద్దున్న బయలుదేరిన కారు ఆరుగంటల ప్రయాణంచేసి, ఒక పల్లెదగ్గర ఆగింది. కోయదొరలు దిగారు. ఎదురుగా గూడెం ఒకటి కని పించింది. కుర్రకుంకలు అక్కడ నగ్నంగా తిరుగుతున్నారు. కోయ స్త్రీలు అర్ధ నగ్నంగా దూరాన కారునుచోద్యంగా చూస్తున్నారు. ఏదో న్యూడ్‌కాలనీలోకి వచ్చానా అని సూటువేసుకున్న రామచంద్రరావు కొంచెం బిడియపడ్డాడు.

కారుదిగి చుట్టూ కలయజూశాడు. తనకోసం నిరీక్షించే జనం ఎవరూ కనిపించలేదు. బంట్రోతు కాలినడిచినంత దూరం చుట్టూ తిరిగి చూశాడు, తిరిగి వచ్చాడు. "కనిపించలేదు వారి కారు" అన్నాడు.

రామచంద్రరావు బంట్రోతు అంజయ్య బ్రహ్మచారి, కాని ఊళ్ళో ఒక పిల్లను ప్రేమిస్తున్నాడు. ఆ ప్రేమరుచులు అనుభవించకముందే యీ ప్రయాణం తగిలింది. తిరిగివచ్చి తన ప్రేయసిని పరిపాలించగలనా లేదా అనే దిగుల్లో పడ్డాడు అంజయ్య. ఒంట్లో బాగులేదన్నా, కొత్త ఆఫీసరు రామచంద్రరావు భయంవల్ల కాదనలేక అరణ్యం వచ్చాడు

అంజయ్య చుట్టూఉన్న చెట్లగుబురుల వెనక ఏం జరిగిందీ తెలియలేదు. అంజయ్యకు ప్రక్కనేఉన్న చింతచెట్టు ఎక్కి రిక్కిచూశాడు.

"సార్! కారు..." అంటూ గబగబ క్రిందకు దిగాడు అంజయ్య.

మరో అయిదు నిమిషాల్లో గుబురుచెట్ల మధ్య సన్నని రహదారి చీల్చుకుంటూ ఒక కారువచ్చి రామచంద్రరావు ముందు ఆగింది. అందులో ఒక గుమాస్తా సూటువేసుకున్న రామచంద్రరావుని 'ఈయనే ఆయన' అన్నట్టు గుర్తుపట్టి సలాం చేశాడు. ఇంక ఆగకుండా రామచంద్రరావు కారుఎక్కాడు అంజయ్యతో. కారులో రామచంద్రరావూ, అంజయ్య, గుమస్తా, డ్రైవరూ ప్రయాణిస్తున్నారు......మబ్బులు ముసురుకు వచ్చాయి......పెద్ద గాలి...తర్వాత వానజల్లులు ప్రారంభించాయి. అరణ్యంలో కొంత చీకటి ఆవరించింది రాక్షసులు ఏదో పొగ జిమ్మినట్లు.

గుమస్తా అరణ్యంలోని గమ్మత్తులు,సౌందర్యాలు నివేదిస్తున్నాడు. రామచంద్రరావు ఆసక్తిగా వింటున్నాడు.

"అవి కాఫీతోటలు" అన్నాడు గుమాస్తా.

రామచంద్రరావుకు అవి చూడాలనిపించింది. "ఒక నిముషం" అన్నాడు రామచంద్రరావు,

కారు ఆగింది.

దిగాడు రామచంద్రరావు. ఒంటరిగా ముందుకు నడిచాడు,గుమాస్తా ఏదో అందామనుకుని బాగుండదని ఆయనవెంట వెళ్ళలేదు. వానజల్లు పడుతూనేవుంది. ఎదో చెట్ల గుబురుల్లోంచి లోపలికి వెళ్ళాడు రామచంద్రరావు.

అటూయిటూ తిరుగుతూ, చూస్తూ అడుగులు వేశాడు.

"బుస్" మని పెద్ద శబ్దం,

రామచంద్రరావు వెనక్కు జరిగాడు కంగారుగా.

కొండచిలువ తలఎత్తి లేచి, నోరుజాచింది భయంకరంగా...తనకి అడ్డంగా నిలబడింది.

రామచంద్రరావు దగ్గర అస్త్రాలులేవు. ఆలోచించాడు. వెనక్కి వెళ్ళడానికి జాగాలేదు. చెట్లు దట్టంగా అల్లుకున్నాయి. చెట్టుకొమ్మ ఎక్కాడు.

ధైర్యం చిక్కబట్టుకుని కొండచిలువ తలమీద నుంచి ఒక పెద్ద "హైజంప్" చేశాడు.

కొండచిలువ తలవెనక్కి తిరిగేలోపుగా పెద్ద పరుగు పందెంలోలా వేగం చూపాడు...రోడ్డు గట్టుకువచ్చి, నిట్టూర్చి వెనుదిరిగి చూచి, కొండ చిలువ తనవెంట రాలేదని ధైర్యం తెచ్చుకుని, నెమ్మదిగా రోడ్డు మీదకు వచ్చి కారు ఎక్కాడు రామచంద్రరావు, తన గండం గురించి ఎవరికి చెప్పదలచ్చుకోలేదు. తక్కిన వాళ్ళ మనోధైర్యం మీద తనకు నమ్మకం లేక.

కారు నడుస్తోంది వేగంగా...రెండు మైళ్ళు గడిచాయి. అసలు యిందాక కారు దిగినపని పూర్తికాలేదు..."మరోసారిఅపుతావా డ్రైవర్" అన్నాడు రామచంద్రరావు.

"బహుశా భయమేమో" అనుకున్నాడు గుమాస్తా. భయపడితే గాని యిన్నిసార్లు రోడ్డుప్రక్కకు ఎందుకు వెళ్ళాలి? కారు ఆగింది.

గాలి బ్రహ్మాండంగా వీస్తోంది. చెట్లు ప్రచండంగా నృత్యం చేస్తు న్నాయి గాలి ఊపులో.

ఒక చెట్టు మొదటకు చేరాడు రామచంద్రరావు.

ఇరుప్రక్కల లోయలు...అగాధం, మధ్య సన్నని బాట...చుట్టూ కొండలు...భయంకరం—అతి సుందరంగా—రామచంద్రరావు నవ్వు తున్నాడు!

ఇంతలో ఫెళఫెళ చప్పుళ్ళు, అమాంతంగా తన ఎదురుగావున్న పెద్దచెట్టు వేళ్ళతోసహా పెకలించుకుని లోయలోకి కూలిపోయింది:..రామ

చంద్రరావు ఒక అడుగు దూరంలోవుండి పోయాడు. కారు దిగివచ్చి జనం "ఆయన అదృష్టాన్ని" పొగిడారు...

ఉరుములు...మెరుపులు...బ్రహ్మాండమైన వాన కురుస్తోంది. కారు కదిలేలా లేదు...ఆపారు...పెద్ద...పిడుగు—గర్జన చేసింది, ప్రక్క చెట్టుమీద పిట్టలు రెండు షాక్‌తిని చనిపోయి నేలవాలాయి. ''ఈ రోజు ప్రాణానికి పరీక్ష" అనుకున్నాడు రామచంద్రరావు.

ఒక అరగంటకు వాన తగ్గింది, కారు ప్రయాణం ప్రారంభించింది.

నాలుగు కొండలమధ్య అతి సుందరమైన వాతావరణం కనిపించింది. రామచంద్రరావు ముగ్ధుడైనాడు, గుమాస్తాతో కలిసి ఒక నిముషం ఆ అందమైన సంధ్యామయ దృశ్యాలు చూడాలని దిగాడు రామచంద్రరావు.

ముందుకు అడుగు వేశాడు...రాళ్ళపై రాళ్ళు సర్కసు చేస్తున్నట్లు కనపడ్డాయి పిట్టల కూతలు, సెలయేళ్ళ గలగల. చెట్లమీదపడిన అరుణ కిరణాలతో ప్రకృతి మెరపు సౌందర్యం, రామచంద్రరావు తన్మయుడై పోయాడు.

ఇంతలో గభాలున కొండమీదనుంచి పదిహేను అడుగుల ఎత్తుగల కొండరాయి ఒకటి అతివేగంగా దొర్లుకుంటూ పరుగెత్తుకువచ్చి క్రిందకు జారి పడింది. రామచంద్రరావును ఒక గజం దూరంలోదూసుకుపోయింది. చనిపోయాననుకున్నాడు, రామచంద్రరావు ఒక్క క్షణం నిట్టూర్చి కళ్ళు తెరిచి చూశాడు. గుమాస్తా "యిలా విచ్చేయండి సార్..." అరిచాడు భయంగా రామచంద్రరావు గెంతి ముందుకు వచ్చాడు. ఇంతలో మహా ప్రవాహంలాంటి జలపాతం ఆయన వెనక పరవళ్ళు త్రొక్కింది. కొండలమీద పడిన వాననీరు ఆ సమయానికి వాగులుగా గుమిగూడి జలపాతంలా మారివచ్చింది. అక్కడే వుండివుంటే రామచంద్రరావు జలపాతంలో కొట్టుకుపోయేవాడు.

"ఏమండీ! యీ ఆరణ్యం చాలా ప్రమాదం...మనం యింక దిగకుండా యింటికి పోవాలి సార్..." అన్నాడు గుమాస్తా.

రామచంద్రరావు కూడా గుమాస్తా అభిప్రాయంతో ఏకీభవించాడు. ఈ రోజు "బహుశా యింక తాను బ్రతికేది లేదేమో" అనుకున్నాడు లోలోపల.

సాయంత్రంపడింది. కారు నడుస్తోంది. కనుచీకటిపడగానే ప్రాజెక్టు చేరాడు రామచంద్రరావు తన పరివారంతో. ప్రాజెక్టులో పిడుగుపడటం వల్ల విద్యుచ్ఛక్తి పోయింది. లైట్లు లేవు. చీకటి భయంకరంగా అలుముకుంది.

ప్రాజెక్టు అధికారి ఒకాయన వచ్చి రామచంద్రరావుకు స్వాగతం యిచ్చాడు. ఊరుబయటి డాక్‌బంగళా ప్రమాదకరం కావటంచేత ఒకేఆఫీసు క్వార్టరు కేటాయించాం మీకు" అన్నాడు ఆయన.

ఆ రాత్రికి ఏం చేయాలో అర్థంకాలేదు రామచంద్రరావుకు. రాత్రి విశ్రాంతి తీసుకుని మర్నాడు ప్రొద్దున్న తాను వచ్చిన ఆఫీసు పని నిర్వహిద్దామనుకున్నాడు. అయినా రాత్రి ఆఫీసర్లతో కలిసి విషయాలు చర్చించవచ్చని అనుకున్నాడు రామచంద్రరావు.

స్నానంచేసి, భోంచేసి ప్రాజెక్టు ఉన్నతాధికారిని కలుసుకోడానికి బయలుదేరాడు. రామచంద్రరావు క్వార్టరు ముందు కారు ఎక్కాడు. కారు ఎదురుగ రివ్వున ఒక బాణంవచ్చి నిలుచుంది. రామచంద్రరావు ఆ చీకటిలో దూరాన ఎవ్వరినీ చూడలేకపోయాడు. డ్రైవరు ధైర్యంగా ముందుకు సాగిపోయాడు రాత్రి సంప్రదింపుల అనంతరం రామచంద్రరావు విశ్రాంతి తీసుకుని నిద్రపోయాడు.

మర్నాడు రామచంద్రరావు లేవగానే తన బంగళాకు ఎదురుగా ధనుర్బాణులైన కార్మికులు చుట్టుముట్టారు. వారిని అదుపులో వుంచడానికి పోలీసులు ప్రక్కనే నిలబడ్డారు. తాపీగా స్నాన పానాదులు పూర్తి చేసుకుని. రామచంద్రరావు సూటు వేసుకుని బయటకు వచ్చాడు. ఆ కోయ

కార్మికులు అంతా పెద్దగా కేకలు, నినాదాలు లేవదీసారు. వాళ్ళ కోయభాష రామచంద్రరావుకు అర్థం కాలేదు.

గమ్మం ముందుకునడిచి "నేను మీ దగ్గరికే వద్దామనుకుంటున్నా... మీరు పదండి మీ స్థలాలకు" అన్నాడు రామచంద్రరావు.

ఆ కార్మికులంతా తమలో తాము గుసగుసలాడుకున్నారు.

"ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి మీ లీడరును కలుసుకుంటా" అన్నాడు రామచంద్రరావు. తర్వాత నమస్కారం పెట్టాడు...ఏమను కున్నారో అంతా వెనుతిరిగి వెళ్ళిపోయారు.

ప్రాజెక్టు కడుతుంటే ఒకడు కాలుజారి కట్టడం మీంచి కిందపడి చని పోయాడు, దానికి కారణం యింజనీరు అంటారు వాళ్ళు—కాదంటారు అధికారులు. తమ జీతాలు పెంచాలంటారు కార్మికులు—వీల్లేదంటారు అధికారులు. ఇవి వీల్లేకపోతే మీరు ప్రాజెక్టు ఎలా కడతారో చూస్తామం టారు కార్మికులు—బైటనుండి లేబరును తీసుకువస్తామంటారు అధికారు లు—తీసుకువస్తే ప్రాణాలతో అధికారులుండరంటారు కార్మికులు—ఈ వాగ్వివాదం రచ్చకు వచ్చింది. సత్యాగ్రహాలు, నినాదాలు...అధికారులకు ఆందోళన, ప్రాజెక్టు పని స్తంభించింది ఇదీకథ—అన్నాడు రామచంద్ర రావు,

తిన్నగా కార్మికుల లీడరును అతని గుడిసె వద్ద కలుసుకుంటా నని బయలుదేరాడు రామచంద్రరావు. వద్దన్నారు ప్రాజెక్టు అధికారులు... అక్కడ వాళ్ళు మీకు ప్రాణాపాయం కలిగించగలరు కనుక యిక్కడికి పిలిపిస్తామన్నారు—కాని రామచంద్రరావు వినలేదు—"నా ధర్మం-అర్థం చేసుకోవాలంటే వారి దగ్గరికే వెళ్ళాలి—లేకపోతే మరీ రెచ్చిపోతారు" అన్నాడు రామచంద్రరావు.

వెంట ఒక తుపాకి పోలీసును తీసుకువెళ్ళమన్నారు. వద్దన్నాడు రామచంద్రరావు చివరకు బాణాయుధుడైన ఒక బంటును వెంటపెట్టుకుని

రామచంద్రరావు కార్మికుల గుడిసెల వద్దకు వచ్చాడు. రామచంద్రరావును చూడగానే వాళ్ళల్లో గుసగుసలు. గుంపులు గుంపులుగా ఆయన్ను చుట్టు ముట్టారు ధనుర్బాణాలతో. రామచంద్రరావు వాళ్ళవైపు ఓసారి చూచి, నవ్వి లీడరున్న గుడిసెలోకి వెళ్ళాడు. చనిపోయిన వానికి ఇచ్చిన పరిహారం చాలదంటాడు లీడరు...జీతాలు పెంచనిదే పనిచేయమంటాడు— ప్రాజెక్టు అధికారులు తలపెట్టిన అవమానాలకు తలఒగ్గమని. తానుచేసే దేదో చూపిస్తామని బెదిరించాడు లీడరు.

రామచంద్రరావు "తొందర పడవద్దు" అన్నాడు. పరిహారం పెంచే ఏర్పాటు చేస్తామన్నాడు. జీతాలు పెంచడం సాధ్యం కాదన్నాడు. "మీరు పనిచేయకపోతే పట్టణం నుంచి లేబరు లారీల్లోదిగుతారు" అన్నాడు రామచంద్రరావు. "చూస్తాం — కాసుకోండి" అన్నాడు లీడరు రామచంద్రరావు గుడిసె బయటికి వచ్చాడు, బాణాలు ఎక్కుపెట్టి అంతానిలుచున్నారు.

రామచంద్రరావు ఏదైనా అంటే, ఒక్క బాణంతో ప్రాణం పోయేలావుంది. నిశ్శబ్దంగా తలవంచుకు నడిచాడు. లీడరు కేకపెట్టాడు- అంతా చెల్లాచెదురుగా విడిపోయారు.

రామచంద్రరావు సంప్రదింపులు జరపడానికి ప్రాజెక్టు అధికారుల వద్దకు వెళ్లాడు, ఆఫీసర్లకు ప్రాజెక్టు ఖాళీచేసి వెళ్ళమని కబురంపాడు. ఆఫీసర్లు రాత్రికి రాత్రి గుట్టుగా తమ నివాసాలు ఖాళీచేసి పోయారు.

మర్నాడు కార్మికులు పనిగట్టారు. రామచంద్రరావును చంపేస్తామన్నారు.

రామచంద్రరావు నవ్వాడు. ఆయన్ను రక్షించడానికి వెన్నంటి ఉన్న ధనుర్బాణుడైన బంటువిల్లు ఎక్కుపెట్టి నిల్చున్నాడు. రామచంద్రరావు అ విల్లు తీసుకుని కిందికి విసిరాడు, "నన్ను ఒక్కడినే చంప దల్చకుంటే చంపండి. తక్కిన అధికారుల కోసం నేను ఛస్తాను పర్వా లేదు...కాని ఇది జ్ఞాపక ముంచుకోండి...నేను మీకు సాయం చేయాలని

వచ్చాను...మీ శ్రేయోభిలాషినే చంపే కృతఘ్నులు అనుకోలేదు మీరు ...సరే నన్ను చంపితే మీకు మేలు జరుగుతుందని ఆశ పడకండి ఏ ప్రభుత్వమూ దౌర్జన్యాన్ని. అరాచకాన్ని సహించదు. మీకు యిష్టమైతే నన్నే చంపండి...నా దగ్గర ఏ ఆయుధం లేదు..."అన్నాడు రామ చంద్రరావు తీవ్రంగా కార్మికులు ఆయన నిబ్బరానికి ఆశ్చర్యపోయారు.

"భయపడని ఆఫీసరు"అన్నాడు ఒకడు."నిజాయితీగల ఆఫీసరు" అన్నాడు మరొకడు,

లీడరు పెద్ద కేక వేశాడు...అందరూ బాణాలు దించేశారు. లీడరు ఒక్కడూ రామచంద్రరావు దగ్గరకు వచ్చి గదిలో మాట్లాడటానికి ముందుకు నడిచాడు.

రామచంద్రరావు రాయబారం అంగీకరించాడు, కాలపరిమితి దాటి నప్పుడు ఎక్కువ పని చేసినందుకు తగిన భత్యంయివ్వడానికి రామచంద్ర రావు కూడా అంగీకరించాడు. సమస్య తీరింది. అందరూ జయ జయధ్వా నాలు చేశారు. దారిలో ప్రయాణం చేస్తున్న ఆఫీసరులు తమకార్లు వెనక్కు మళ్ళించారు...

రామచంద్రరావు నవ్వాడు ఆనందంగా. లీడరు నమస్కరించాడు మర్నాడు రామచంద్రరావు తిరుగు ప్రయాణం సాగించాడు పట్టణానికి.

ప్రాజెక్టు అధికారులు అభినందనలు తెలిపారు. "తన ప్రాణాలు ఒడ్డి మా ప్రాణాలు కాపాడారు" అన్నారు

అరణ్యాలు దాటి, అనేక గండాలు దాటి, ఆఫీసు చేరుకున్న రామ చంద్రరావు కథ విని ఆఫీసులో ముక్కు మూసుక్కూర్చున్న గుమాస్తాలు మునీశ్వరులు గుడ్లప్పచెప్పి, భజనచేసి సంతోషించారు.

★